# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- **మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్**

మక్తల్‌టౌన్,అక్టోబర్11: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఎన్నికలకోడ్ అమలులోకి వచ్చిందన్నారు. రాజకీయపార్టీ నాయకులు కోడ్‌ను ఉల్లంఘించి కార్యక్రమాలు చేపడితే కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల కోడ్‌కనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

### ఎన్నికల నియమావళి పాటించాలి

అమరచింత, అక్టోబర్ 11: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి తూచ తప్పకుండా పాటించాలని లేకుంటే చట్టరీత్య చర్యలు తప్పవని అమరచింత మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా అన్నారు. బుధవారం ఆయన వార్డు ఆఫీసర్లతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాలు, గోడలపై వేసిన వివిధ పార్టీల గుర్తులు, రాజకీయ పార్టీల నాయకుల పేర్లను తుడిచివేయించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ఇకపై ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా గోడలపై డలపై ప్రచార రాతలు రాయకుడదన్నారు. పట్టణ ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు కృష్ణయ్య, ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.



అమరచింతలో రాతలను తుడిచివేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా

## బాలికా విద్యను ప్రోత్సహించాలి

- **ఎంపీడీవో యశోద**




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

కృష్ణ, అక్టోబర్ 11 : బాలికా విద్యను ప్రోత్సహించాలని ఎంపీడీవో యశోద, సీఈఓ జ్యోతి, జీసీడీవో పద్మనిళిని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఆడ పిల్లలను ఇంటి పనుల కోసం చదువుకు దూరం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాలికా విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిశుసంక్షేమ శాఖ అధికారులు కవిత, విజయ్, పాఠశాల ఎస్‌వో శాలిని, ఎస్సై విజయ్‌భాస్కర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

## గడువులోగా సరుకులు పంపిణీ చేయాలి

- **తాసీల్దార్ శివశ్రీనివాస్**



తాసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

ఊట్కూర్, అక్టోబర్ 11: ప్రతి నెలా గడువులోగా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని తాసీల్దార్ శివశ్రీనివాస్ రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తాసీల్దార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రజలతో సత్సంబంధం పెంచుకోవాలన్నారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించిందని వివరించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల గౌరవాధ్యక్షుడు జయంతిరెడ్డి, డీలర్లు నర్సింహులు, హరిప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, బాల కిష్టయ్య, నర్సింహా, బాల రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

- **మాగనూర్ ఎస్సై మల్లేశ్**

మాగనూర్ అక్టోబర్ 11: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల కేంద్రంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లాలంటే అధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. దవాఖాను బిల్లుల చెల్లింపుల కోసమైతే రోగి రిపోర్టులు, శుభకార్యాల కోసమైతే సంబంధిత ఆధారాలు, వస్తువులు, ధాన్యం లేదా భూమి విక్రయిస్తే బిల్లులు, డాక్యుమెంట్స్ చూపించాలన్నారు. ఆధారులు లేక పోతే డబ్బు సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన డబ్బులను ఎన్నికలు ముగిశాక ఆధారాలు చూపితే తిరిగి ఇస్తామన్నారు. కాగా వహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం గంగవతికి చెందిన సోమశీ అనంద్ అను మతులు లేకుండా దాదాపు 80కి పైగా మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మహాసభ కరపత్రాల విడుదల

మాగనూర్ అక్టోబర్ 11: మండలంలోని వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం డీటీఎఫ్ నాయకులు రాష్ట్ర మహాసభ పోస్టర్లు,కరపత్రాల విడుదల చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య చంద్ర మాట్లాడుతూ అక్టోబర్ 15,16,17 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు వివిద రాజకీయ,విద్యారంగ నిపుణులు పాల్గొంటారన్నారు. మహాసభకు ఉపాధ్యాయులు,ప్రజాస్వామిక వాదులు,విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెంచాలి

- **డీఐఈవో జాకీర్‌హుస్సేన్**



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో జాకీర్‌హుస్సేన్

ఆత్మకూరు, అక్టోబర్ 11: ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషిచేయాలని ఇంటర్ విద్య జిల్లాధికారి జాకీర్‌హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన ఆత్మకూరు జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అయన అధ్యాపకులు, విద్యార్థులతో వేరువేరుగా సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది 50 శాతం కూడా ఉత్తీర్ణత కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా నైపుణ్యాలను పెంపొందించి ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. నేటి రోజుల్లో అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, చదువులో నైపుణ్యం సాధిస్తేనే ఉన్నత ఉద్యోగాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. లక్ష్యంతో ముందుకుసాగితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకరాగా పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అంతకుముందు కళాశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీ.ఎస్.రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బాలికలు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

- **చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు**



ఊట్కూర్‌లో మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్

ఊట్కూర్, అక్టోబర్ 11: బాలికలు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండి చదువుకోవాలన్నారు. సమాజంలో లింగ వివక్ష, బాల్య వివాహాలకు అడ్డు కట్ట వేసేందుకు తల్లి దండ్రులతో పాటు ఇరుగు పొరుగు వారికి అవగాహన కల్పించాలన్నారు. పిల్లల లింగ నిష్పత్తిని సరిదిద్దేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సెలర్ విద్యా రాణి, ఉపాధ్యాయులు ప్రేమ కుమారి, షాహీన్, అనీల్, రత్నమ్మ, అశోక్, రత్నయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

మక్తల్ టౌన్, అక్టోబర్11:బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాదులు దత్తత్రేయ, సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మక్తల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఆడపిల్లలకు 18 ఏండ్లలోపు వివాహాలు చేయడం వల్ల వారు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడంతో పాటు వారి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఆడపిల్లకు 18 ఏండ్లు పూర్తయిన తరువాతే వివాహం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహరహిత భారతదేశం కోసం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుధీర్, ఉపాధ్యాయులు ప్రసన్న, కృష్ణవేణి, రేణుక, స్వప్న, సుభాషిణి, జయశ్రీ, విజయశ్రీ, అరుణజ్యోతి, మీరాబాయ్, నఫీసున్నీసాబేగం, అర్షియా, పరంజ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



మక్తల్ లో అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

## అందుబాటులో గుర్రం శెనగ విత్తనాలు

ఊట్కూర్, అక్టోబర్ 11: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 120 బస్తాల గుర్రం శెనగ విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఏవో గణేశ్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. జేజీ-11 రకం 25 కిలోల బస్తా ధర రూ. 1,875కి రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆగ్రో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

## మానసిక వికాసాన్ని పెంపొందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఊట్కూర్, అక్టోబర్ 11: ప్రీస్కూల్ విద్యతో పిల్లల మానసిక వికాసాన్ని పెంచేందుకు కృషి చేయాలని సీడీపీవో జయ అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతున్న పిల్లలలో మానసిక, శారీరక అభివృద్ధిని నిరంతరం గుర్తిస్తూ ఆట పాటలతో విద్యనందించాలన్నారు. పిల్లలు, గర్భిణీ, బాలింతల్లో లోప పోషణ నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆయాలు శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

అమరచింత, అక్టోబర్ 11: కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎస్. అజయ్, ఉపాధ్యక్షుడు బీ.వెంకటేశ్ ఆరోపించారు. బుధవారం వారు మండలంలోని పాంరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో కలిసి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శంకర్ , ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

## 18 నుంచి చౌడేశ్వరీ మాత ఉత్సవాలు

ఊట్కూర్, అక్టోబర్ 11: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ మాత ఉత్సవాలను ఈ నెల 18 నుంచి 20 వతేదీవరకు నిర్వహించనున్నట్లు దేవాంగ కులసంఘం, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని ముస్తాబు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయంలో గణపతి, సింహం, బలిపీఠం, అభిషేక మూర్తి, కలశం, అమ్మవారి విగ్రహాలను పునః ప్రతిష్టాపన చేసేందుకు ఆర్లగడ్డ పట్టణంలో ప్రత్యేకంగా తయారు చేయించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.